క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



చికిత్స పొందుతున్న కార్యకర్తకు నగదును అందజేస్తున్న ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని అల్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు శాప్ మాజీ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆర్థిక సహాయాన్ని అందించారు. అల్లూరుకు చెందిన బోయ శేఖర్ అనే కార్యకర్త అనారోగ్యంతో బాధపడుతున్నారని తెలుసుకుని వైద్య ఖర్చుల కోసం రూ.70వేలను మండల ఎంపీపీ మురళీకృష్ణారెడ్డి, గ్రామ నాయకుడు రవీంద్రనాయుడు ద్వారా అతనికి అందజేశారు. ఈ సందర్భంగా అతడి కుటుంబసభ్యులు సిద్ధార్థరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

బీజేపీ జిల్లా కార్యదర్శుల నియామకం

శ్రీశైలం: బీజేపీ నంద్యాల జిల్లా ప్రధాన కార్యదర్శులుగా నలుగురిని ఎంపిక చేస్తూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ బైరెడ్డి శబరి బుధవారం ప్రకటించారు. శ్రీశైలం నియోజకవర్గం నుంచి అంతిరెడ్డి అరవింద్‌రెడ్డి ,బనగానపల్లె, నందికొట్కూరు నుంచి మండ్ల గంగాధర్ శివకృష్ణయాదవ్, కొండెపోగు చిన్నసుంకన్నలను ఎంపిక చేశారు. ఎంపికైనవారు బుధవారం అధ్యక్షురాలిని కలిసి ఛత్రపతి శివాజీ చిత్రపటాన్ని బహూకరించి శాలువాలతో సత్కరించారు.

ఆత్మకూరు పట్టణానికి మరో పోలింగ్ బూత్

ఆత్మకూరురూరల్: రానున్న సార్వత్రిక ఎన్నికలకు ఆత్మకూరు పట్టణంలో అదనపు పోలింగ్ బూత్ ఏర్పాటు కానుంది. ప్రస్తుతం ఆత్మకూరు పట్టణంలో 70 బూత్‌లు ఉండగా 70 ఏగా రహమత్ నగర్‌లో మరో బూత్ ఏర్పాటు చేశారు. అర్బన్ ప్రాంతంలో 1500 ఓట్లకు ఒక బూత్ ఉండాలని, అలాగే రూరల్ ప్రాంతంలో 1200 ఓట్లకు ఒక కేంద్రం ఉండాలి. రహమత్ నగర్‌లోని బూత్‌లో 1,487 దాటడంతో మరిన్న ఓట్లు నమోదయ్యే అవకాశం ఉండడంతో మరో పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. శ్రీశైలం నియోజకవర్గంలో ప్రస్తుతం మొత్తం 1,91,038 మంది ఓటర్లు ఉన్నారు. ఈ సంఖ్య ఎన్నికల సమయానికి పెరిగే అవకాశం ఉంది. ఆత్మకూరు మండలం, మున్సిపాలిటి కలుపుకుని మొత్తం 61680 ఓట్లు ఉన్నాయి.

ఆర్బీకేలను సద్వినియోగం చేసుకోండి



ఆర్బీకేలో పురుగు మందును తనిఖీ చేస్తున్న ఏడీఏ ఆంజనేయ

కొత్తపల్లి: రైతులు ఆర్బీకేలను సద్వినియోగం చేసుకోవాలని ఆత్మకూరు వ్యవసాయ సహాయ సంచాలకులు బి.ఆంజనేయ అన్నారు. బుధవారం మండల వ్యవసాయాధికారి కె.మహేష్‌తో కలసి ఎర్రమఠం, ముసలిమడుగు, కొత్తపల్లి రైతుభరోసా కేంద్రాలను సందర్శించారు. పంటనమోదు , ఈకేవైసీ ప్రక్రియను పరిశీలించారు. ఈకేవైసీ ప్రక్రియను త్వరగ పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన మాట్లాడుతూ.. పత్తి పంటలో రసం పీల్చు పురుగులు (పచ్చదోమ, తామర పురుగులు)గ మనించామని, వాటి నివారణకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. మండలానికి 250 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరు అయ్యాయని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్ఎన్ తండాలో నీటి సమస్య పరిష్కారం



బోరు తవ్వకాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ నాగులు నాయక్

ఆత్మకూరు: మండలంలోని ఎస్ఎన్‌తండా గ్రామంలో ఇటీవల తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొనడంతో గ్రామ సర్పంచ్ నాగులు నాయక్, వైఎస్సార్‌సీపీ నాయకులు శివశంకర్ నాయక్ బుధవారం గ్రామంలో నూతన బోరు తవ్వకాన్ని ప్రారంభించారు. వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి ఇటీవల గడప గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పర్యటించినప్పుడు సీసీ రోడ్లు, నూతన బోర్లు వేయాలని అభ్యర్థించామన్నారు. అందుకు ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి బోరు, సీసీ రోడ్లు మంజూరు చేశారని చెప్పారు. ఇందులో భాగంగా కొత్త బోర్లు ఏర్పాటు చేశామని, దీంతో తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేశ్వర నాయక్, తదితరులు పాల్గొన్నారు.



ఓపీ కోసం బారులు తీరిన తరిగోపుల గ్రామప్రజలు



శివపురంలో ఈసీజీ పరీక్ష చేస్తున్న దృశ్యం



తరిగోపులలో కంటిపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ప్రజారోగ్యానికి మొదటి ప్రాధాన్యత

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- జగనన్న ఆరోగ్య శిబిరాల పరిశీలన
- వృద్ధులకు కంటిఅద్దాల పంపిణీ

పాములపాడు: కుటుంబంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటేనే అందరూ సంతోషంగా ఉంటారని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. బుధవారం మండలంలోని జూటూరు గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యానికి మొదటి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు వైద్యం అందించేందుకు నిపుణులైన వైద్యులు గ్రామాలకు వచ్చి వైద్య పరీక్షలు నిర్వహించేలా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. వైద్యులు నిర్వహిస్తున్న పరీక్షలను, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు. శిబిరంలో బీపీ, రక్త పరీక్షలు చేయించుకున్నారు. అంతకు మునుపు కంటి అద్దాలను పంపిణీ చేశారు. శిబిరంలో 284 మంది వైద్య పరీక్షలు చేయించుకోగా 14 మందిని మెరుగైన వైద్యం కోసం రెఫర్‌చేశారు. 132 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. శిబిరంలో సర్పంచు నాయిని సావిత్రమ్మ, అడిషినల్ డీఎంహెచ్ఓ కాంతారావునాయక్, డాక్టర్లు నాగలక్ష్మీదేవి, దీపా నాగవేణి, చిన్నపిల్లల డాక్టర్ నవీన్‌కుమార్, గైనిక్ దివ్యశ్రీ వైద్యసేవలందించారు. అనంతరం రైతులకు సబ్సిడీపై ప్రభుత్వం అందిస్తున్న శనగ విత్తనాలను ఎమ్మెల్యే అందజేశారు. ఎంపీడీఓ గోపీకృష్ణ, తహసీల్దార్ రత్నరాధిక, వైస్ ఎంపీపీ బండ్లమూరి వెంకటేశ్వర్లు, ఉప సర్పంచు సలాం, రుద్రవరం సర్పంచు రామస్వామి, మద్దూరు ఎంపీటీసీ బషీరాహ్మద్, వైఎస్ఆర్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం....మంచి ఆరోగ్యం

కొత్తపల్లి: గ్రామీణ ప్రాంతాలలో ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించి ఆరోగ్య వంతులుగా చేసేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంపులను ఊరూరా నిర్వహిస్తున్నారని తొగురు ఆర్థర్ అన్నారు. బుధవారం మండలంలోని శివపురం గ్రామ సచివాలయం వద్ద ఏర్పాటుచేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సందర్శించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్ ను పరిశీలించి, ప్రజలకు అంగన్‌వాడీ సెంటర్లలో ఏ విధంగా ఇస్తున్నారన్న విషయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ కాంతారావు నాయక్, ఎంపీడీవో మేరీ, ఇన్‌చార్జ్ తహసీల్దార్ పెద్దన్న, ఎంఈఓ–2 ఇనాయతుల్ల, సర్పంచ్ చంద్రశేఖర్ యాదవ్, కో– ఆప్టెడ్ మెంబర్ మహమ్మద్ గౌస్, ఎంపీటీసీ సభ్యుడు శివన్న, వైద్యాధికారులు విజయేంద్ర వర్మ, జబీర్, జుబేదా, సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



శివపురంలో వృద్ధురాలికి కంటి అద్దాలు పెడుతున్న ఎమ్మెల్యే ఆర్థర్

కొణిదేలలో వైద్య శిబిరం..

నందికొట్కూరు రూరల్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనమోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాలలోని పేద ప్రజలు ఎంతో ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. బుధవారం మండల పరిధిలోని కొణిదేల గ్రామంలో అధికారులు, నాయకులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలోని ప్రజలకు 7 రకాల వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నవీన్, ఎంపీడీవో శోభారాణి, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, వైద్యులు తదితరులు పాల్గొన్నారు.



బీపీ పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే ఆర్థర్

ప్రజలకు కార్పొరేట్‌స్థాయి వైద్యం

జూపాడుబంగ్లా: గ్రామీణ ప్రజలకు కార్పొరేట్ వైద్యం అందించటమే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పమని జిల్లా అదనపు వైద్యాధికారిణి శారదాబాయి, వైఎస్సార్‌సీపీ జిల్లా జాయింట్ సెక్రటరీ కోసిక తిరుమలేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ జగదీశ్వరరెడ్డి, ఎంపీపీ సువర్ణమ్మ, వైఎస్సార్సీపీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి, జేసీఎస్ మండల అధ్యక్షుడు నాగార్జునరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తరిగోపుల గ్రామంలో జగనన్న ఆరోగ్యసురక్ష క్యాంపును నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యసిబ్బంది 450మందికి పలురకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. వారిలో 22మందికి ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. 10 మందికి పలురకాల శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు కర్నూలుకు రెఫర్ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ పుల్లయ్య యాదవ్, ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహనచక్రవర్తి, డాక్టర్లు గంగాధర్, మౌనిక, పునేశ్వరరావు, మధునాయక్ పాల్గొన్నారు.

గుండె పరీక్ష ఉచితంగా చేశారు



గ్రామంలోనే జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపు నిర్వహించి అన్ని వ్యాధులకు సంబంధించిన పరీక్షలు చేసి, ఉచితంగా మందులు ఇవ్వడం హర్షించదగ్గ విషయం. నాకు గుండెకు సంబంధించిన వ్యాధితో బాధపడుతూ కర్నూలు నందు చికిత్స చేయించుకున్నాను. అనంతరం టెస్టులకు వెళ్లాలంటే ఖర్చుతో కూడుకున్న పని. కార్యక్రమంలో ఇక్కడే ఈసీజీ నిర్వహించి గుండె పనితీరును డాక్టర్లు వెంపటే చెప్పన్నారు. చాలా బాగుంది. – రవణయ్య గౌడ్, శివపురం

కంటి అద్దాలు ఇచ్చారు



క్యాంపు కంటే ముందు ఇంటి వద్దకు వచ్చి కళ్లను పరీక్షించారు. కంటి చూపు తక్కువుందని చెప్పారు. ఈ రోజు ఎమ్మెల్యే చేతుల మీదుగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. కళ్లు చూపించుకోవాలంటే టౌన్‌కు వెళ్లాల్సి వచ్చేది, కనీసం రూ.5వేలన్నా ఖర్చు అయ్యేది. ఇక్కడ అంతా ఉచితంగానే జరిగింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు. –లక్ష్మీదేవి, జూటూరు

చెంతకే వైద్యం..అద్భుతం



గతంలో ఏ ప్రభుత్వమూ ఇలా ఇళ్ల వద్దకు వచ్చి పరీక్షలు చేసి ఆస్పత్రులకు తీసుకొచ్చిన దాఖలాలు లేవు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మాలాంటి వృద్ధులకు మంచి వైద్య సదుపాయాలు కల్పించారు. హాస్పిటళ్లకు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే గంటల తరబడి క్యూలో నిల్చుని ఇబ్బంది పడేవాళ్లం. అటువంటిది గ్రామాల్లోనే క్యాంపులు నిర్వహించి సేవలందిస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది. – చెన్నమ్మ, కొణిదేల

భక్తుల రద్దీకనుగుణంగా సౌకర్యాలు కల్పించాలి



మాట్లాడుతున్న ఈఓ డి.పెద్దిరాజు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలమహాక్షేత్రంలో భక్తుల రద్దీకనుగుణంగా ఎప్పటికప్పుడు ఆయా సౌకర్యాల పట్ల అన్ని విభాగాల వారు చర్యలు చేపట్టాలని దేవస్థాన ఈఓ డి.పెద్దిరాజు ఆదేశించారు. భక్తుల సౌకర్యాలపై బుధవారం వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఓ మాట్లాడుతూ సామాన్య భక్తుల సౌకర్యార్థ మరిన్ని డార్మిటరీలు, శౌచాలయాలు నిర్మించేందుకు అంచనాలను రూపొందించాలని ఇంజినీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. వారాంతపు రోజులలో సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించాలన్నారు. క్యూ కాంప్లెక్స్‌లు, క్యూలైన్లు, ఆలయం, ఆర్జిత సేవలు, అన్నప్రసాద వితరణ మొదలైన చోట్ల సిబ్బందికి ప్రత్యేక విధులు కేటాయించాలని సూచించారు.

‘శ్రీశైల క్షేత్రం శివశక్త్యాత్మకం’

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలక్షేత్రం శివశక్త్యాత్మకమని, ఇక్కడ ఆదిపరాశక్తి భ్రమరాంబాదేవిగా వెలసిందని సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. శ్రీశైలమహాక్షేత్రంలో హిందూ ధర్మప్రచారంలో భాగంగా నిర్వహిస్తున్న బ్రహ్మశ్రీ ‘శ్రీశైల మహిమా విశేషాలు’ ప్రవచన కార్యక్రమం నాల్గవరోజు బుధవారం కూడా కొనసాగింది. ఆయన మాట్లాడుతూ.. లోకకంటకుడైన అరుణాసురుని సంహరించడానికై జగన్మాత తేజోమయమైన భ్రమర రూపాన్ని ధరించిందన్నారు. విశ్వానికి క్షేమం కలిగించడానికై దుష్ట శక్తులను దునుమాడి, దేవతలు, ఋషుల ప్రార్థనల మేరకు భూమిపై భ్రామరీ రూపంలో ఉండటానికి నిశ్చయించుకుందన్నారు. అప్పటికే జ్యోతిర్లింగధామమైన శ్రీశైలాన్ని తన పీఠంగా ఎంచుకుని, ఈ కొండపై స్థిరనివాసం ఏర్పరచుకుని భక్తులను అనుగ్రహిస్తుందని చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీశైలం ప్రాజెక్ట్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రం ఇంగ్లిష్ మీడియంలో బోధించుటలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. హుస్సేన్‌బాషా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి అతిథి అధ్యాపకులుగా (గెస్ట్ లెక్చరర్) పని చేసేందుకు అర్హులైన అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ ఉదయం 11 గంటలకు ఇంటర్వ్యూకు ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా హాజరుకావాలన్నారు.

దైవ నామస్మరణే ముక్తికి మార్గం

మహానంది: కలియుగంలో దైవనామస్మరణే ముక్తికి మార్గమని టీటీడీ అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి శ్రీశ్రీ విజయశంకర స్వామిజీ అన్నారు. రాష్ట్రస్థాయిలోని కళాకారులతో బుధవారం మహానందిలోని టీటీడీ కల్యాణ మండపంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహానందిలో నవంబర్ 6న ఉదయం నుంచి 7వ తేదీ ఉదయం వరకు అఖండ శివనామసంకీర్తన కార్యక్రమం చేసేందుకు నిర్ణయించామన్నారు. ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు నల్లగట్ల వెంకటేశ్వర్లు, శివరామిరెడ్డి పాల్గొన్నారు.

- తమ్మడపల్లెలో విలేజ్ హెల్త్‌క్లినిక్ ప్రారంభం
- బుడ్డా, ఏరాసు కుటుంబాలు ఏళ్లు పాలించినా ఏం చేశారు ?
- ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

నెరవేరిన పదేళ్ల కల

మహానంది: తమ్మడపల్లె ఎస్సీ కాలనీలో పదేళ్లుగా నెరవేరని తాగునీటి సమస్య పరిష్కారానికి ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పరిష్కారం చూపారు. రూ. 32.19లక్షలతో తాగునీటి కోసం పైపులైన్ పనులకు బుధవారం భూమిపూజ చేశారు. అంతకు ముందు రూ. 17.50లక్షలతో నిర్మించిన విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మహానంది మండలంలో ఇటీవల దెబ్బతిన్న అరటి రైతులకు రూ. 1.25 కోట్లు మంజూరయ్యాయన్నారు. అరటి పంటకు బీమా సౌకర్యం పొడిగించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రులను కలిశామని, త్వరలోనే రూ. 5.76 కోట్లు పరిహారం వస్తుందని చెప్పారు. మహానంది, బండిఆత్మకూరు మండలాల రైతులకు యూరియా అందుబాటులో ఉంచాలని వెంటనే పంపించాలని జిల్లా వ్యవసాయాధికారులతో ఫోన్లో చెప్పగా వెంటనే స్పందించారు.



తమ్మడపల్లెలో విలేజ్ హెల్త్‌క్లినిక్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

తప్పులు చేసి జైలుకు పోతే సానుభూతి వస్తుందా

చంద్రబాబు లాంటి దొంగలు తప్పు చేసి జైలుకు పోతే సానుభూతి వస్తుందా, న్యాయం నీ వైపు లేదు కాబట్టే జైలుకు పోయావని, తప్పులు కప్పిపుచ్చుకుని తండ్రీకొడుకులిద్దరూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. సంపద సృష్టిస్తానంటూ నీతివాక్యాలు చెబితే రాష్ట్ర ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. రాష్ట్రాన్ని శ్రీలంకలా చేస్తున్నారన్న పెద్ద మనిషి తప్పులు చేసి జైలుకు పోయారన్నారు. బుడ్డా, ఏరాసు కుటుంబాలు శ్రీశైలం నియోజకవర్గాన్ని ఎన్నేళ్లు పాలించినా ఒక్క ఆస్పత్రి కట్టించిన పాపాన పోలేదని, మా ప్రభుత్వంలో రూ. 19కోట్లతో ఆస్పత్రులు కట్టామని చెప్పారు. ఇష్టమొచ్చినట్లు తిట్లు తిట్టేవారికి ఓటేస్తారా, లేక కడుపులు నింపేవారికి ఓటేస్తారో ఆలోచించుకోవాలని ప్రజలకు హితవు పలికారు. కార్యక్రమంలో మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి, ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, నాయకులు శరభారెడ్డి, కొండా మధుసూదన్‌రెడ్డి, మధురెడ్డి, నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

ఇందిరానగర్‌లో సౌకర్యాలు కల్పించాలి

ఆత్మకూరు: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలో వర్షపు నీరు నిలిచిన రహదారిలో బుధవారం సీపీఎం నాయకులు వరినాట్లు వేసి నిరసన తెలిపారు. సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, సురేంద్ర మాట్లాడుతూ ఇందిరానగర్ కాలనీలో ఎన్నో ఏళ్లుగా రహదారులు సరిగా లేవని, వర్షం వస్తే కాలనీ వాసులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీలో రహదారితో పాటు వీధి దీపాలు, డ్రైనేజీ కాల్వలు ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు నాగేశ్వరరావు, మహ్మద్, పులిరాజు, చింతలయ్య పాల్గొన్నారు.

హైవే పనులు అడ్డుకునే హక్కు ఎవరికీ లేదు

జూపాడుబంగ్లా: 340సీ హైవే రోడ్డు నిర్మాణ పనులను అడ్డుకునే హక్కు ఎవరికీ లేదని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. అసైన్, ప్రభుత్వ భూములకు నష్టపరిహారం ఇచ్చేంత వరకు రోడ్డు నిర్మాణం పనులు జరగనివ్వమంటూ బుధవారం జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఎస్ఐ మారుతిశంకర్ వారి సమస్యలను జేసీ దృష్టికి తీసుకెళ్లారు. చాబోలు వెళ్తున్న ఆయన అక్కడికి చేరుకొని రైతుల సమస్యలు ఆలకించారు. జేసీ మాట్లాడుతూ భూముల యజమానులు సమర్పించిన రికార్డులు సక్రమంగా ఉన్నవాటికి ఇప్పటికే నష్టపరిహారం వారి బ్యాంకు ఖాతాల్లో జమచేశామన్నారు. ఇంకా తమ వద్ద రూ.40కోట్ల నిధులున్నాయని వాటిని కూడా రికార్డులు సక్రమంగా అందజేసే రైతులకు చెల్లించటానికి సిద్ధంగా ఉన్నామన్నారు. 1975 అసైన్డ్‌మెంటు చట్టం ప్రకారం డీ పట్టా పొంది ఉండి అసైన్డ్‌మెంటు కమిటీలో అప్రూవల్ చేయించుకున్న వారికి, వారి వారసులకు మాత్రమే నష్టపరిహారం మంజూరు చేస్తామన్నారు. అలాకాకుండా అసైన్డ్‌మెంటు, డీపట్టా భూములను కొనుగోలు చేసి, పట్టా తీసుకున్న వారికి నష్టపరిహారం వర్తించదని స్పష్టం చేశారు. గ్రామకంఠం భూములు, కల్లాల భూములకు సంబంధించిన సమగ్ర వివరాలు తమకు పంపిస్తే వాటిపై తాము సరైన నిర్ణయం తీసుకుంటామని జేసీ తహసీల్దార్ పుల్లయ్యయాదవ్‌ను ఆదేశించారు. సమస్యలు ఏమైనా ఉంటే తహసీల్దార్‌తో గానీ లేదా నేరుగా తనతోగానీ సంప్రదించాలే తప్పా హైవే రోడ్డు నిర్మాణం పనులను అడ్డుకోవద్దని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతులు పిక్కిలి శ్రీనివాసులు, కరుణాకర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, సీపీఐ నాయకులు రమేష్‌బాబు, బాబు పాల్గొన్నారు.



రైతులతో మాట్లాడుతున్న జేసీ రాహుల్

సమగ్ర భూసర్వేను వేగవంతం చేయండి

సమగ్ర భూ సర్వేను వేగవంతం చేసి త్వరగా పూర్తి చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి సర్వే సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన మండలంలోని తర్తూరు గ్రామంలో భూ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన మ్యాప్‌ను పరిశీలించి భూముల వివరాలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో దండోరా వేయించటంతో పాటు రైతులకు నోటీసులు జారీ చేయాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. రైతుల సమక్షంలో వారి పొలాలను సర్వే చేసి హద్దులు చూపించాలన్నారు. రోవర్లను వినియోగించి రోజుకు కనీసం వంద ఎకరాల సర్వే పూర్తిచేసి, ఈ నెలాఖరులోగా భూసర్వే ప్రక్రియను పూర్తిచేసి రైతులకు పాసుపుస్తకాలను అందజేయాలని సూచించారు. మండలంలోని 7గ్రామాల్లో సర్వే కొనసాగుతుండగా రోవర్లు కేవలం మూడు మాత్రమే ఉన్నాయని తహసీల్దార్ పుల్లయ్యయాదవ్ జేసీకి తెలుపగా అదనంగా మరో రెండు రోవర్లను పంపిస్తామని జేసీ చెప్పారు. కార్యక్రమంలో సర్పంచ్ పీఎం నాగిరెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ నాగన్న, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లోనే స్పెషలిస్ట్ వైద్యులు



వెలుగోడు హెల్త్ క్యాంపులో రక్త పరీక్ష చేయించుకుంటున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

- ఎథిక్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభం

వెలుగోడు: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చరిత్రాత్మక ఘట్టమమని, గ్రామాలకే స్పెషలిస్ట్ వైద్యులు తరలివచ్చి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం రాష్ట్రంలో మునుపెన్నడూ చూడలేదని ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. బుధవారం వెలుగోడు పట్టణంలోని 1వ సచివాలయం పరిధిలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వైద్య శిబిరాని సందర్శించి, వైద్య సేవల గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు మెరుగైన వైద్యం ఇవ్వాలనే లక్ష్యంతో..ఆరోగ్య ఆంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ఇంటింటా జల్లెడ పట్టి వ్యాధిగ్రస్తులని గుర్తిస్తున్నారని చెప్పారు. రోగులకు గ్రామాల్లోనే ప్రత్యేక హెల్త్ క్యాంపులు నిర్వహించి గుండె సంబంధిత పరీక్షలు, బీపీ, షుగర్, థైరాయిడ్, కంటి పరీక్షలు ఇతర జనరల్ చెకప్‌లు చేసి వైద్య చికిత్స అందిస్తున్నారన్నారు. ఇంకా మెరుగైన వైద్యం అవసరమనుకుంటే ఆరోగ్య శ్రీ పథకం ద్వారా కార్పొరేట్ హాస్పిటల్‌కి రెఫర్ చేస్తున్నారని తెలిపారు. వెలుగోడు పట్టణంలో నూతనంగా రూ.6.1 కోట్లతో నిర్మించిన సీహెచ్‌సీలో హార్ట్ ఎటాక్ వచ్చినప్పుడు ఉపయోగించే రూ.40,000 విలువ చేసే ఇంజక్షన్ ఉచితంగానే ఇవ్వనున్నారని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అవసరం రాష్ట్రానికి ఎంతో ఉందన్నారు. ఈ ప్రభుత్వానికి మరొక్కసారి అవకాశమిచ్చి జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం నూతన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, జేసీఎస్ మండల కన్వీనర్ దేశం తిరుపంరెడ్డి, సర్పంచ్ వేల్పుల జయపాల్, జిల్లా కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సులేమాన్, వైస్ ఎంపీపీ శంకర్‌నాయక్, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.



తమ్మడపలెలో వృద్ధులకు కళ్లద్దాలు పెడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

పేదల పెన్నిధి సీఎం జగన్

మహానంది: పేదల కష్టాలు తెలిసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పేదల పెన్నిధి అని, ఆయన ప్రవేశపెట్టిన జగనన్న సురక్ష పేదల ఆరోగ్యానికి రక్షణ లాంటిందని ఎథిక్స్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి అన్నారు. నియోజకవర్గ నేత శిల్పా భువనేశ్వరరెడ్డితో కలిసి బండిఆత్మకూరు, మహానంది మండలాల్లోని బి.కోడూరు, తమ్మడపల్లె గ్రామాల్లో బుధవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎంపీపీలు బుడ్డారెడ్డి యశస్విని, దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కొమ్మా మహేశ్వరరెడ్డి, జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మాజీ ఎంపీపీ నాగభూపాల్‌రెడ్డి, ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ శశికళారెడ్డి, బి.కోడూరు, తమ్మడపల్లె సర్పంచులు వెంకట జయలక్ష్మి, సాలమ్మ, ఎంపీటీసీ దక్కా జయమ్మ, ఉప సర్పంచ్ కొమ్మా ప్రతాపరెడ్డి, జేసీఎస్ ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లాడ్జీల వద్ద ధరల బోర్డులు ఏర్పాటు చేయాలి

సాక్షి ఎఫెక్ట్

మహానంది: మహానందిలోని లాడ్జీల వద్ద వసతిగదుల అద్దెల ధరలతో బోర్డులు ఏర్పాటు చేయాలని మహానంది తహసీల్దార్ జనార్దన్‌శెట్టి, ఎస్ఐ నాగేంద్రప్రసాద్ ఆదేశించారు. రద్దీ నేపథ్యంలో అధికంగా వసూలు చేయడంతో భక్తులు ఇబ్బందులు పడటంపై సాక్షి దినపత్రికలో ఈ నెల 2వ తేదీన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ శివనాగజ్యోతి, డీటీ సత్యశ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో లాడ్జీ ఓనర్లు, నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రద్దీ లేనప్పుడు ఒకలా, రద్దీ ఉన్నప్పుడు మరోలా ఇష్టానుసారంగా రేట్లు పెంచొద్దన్నారు. లైసెన్సులు లేనివారు అనుమతులు తీసుకోవాలని, లేదంటే లాడ్జీలను సీజ్ చేస్తామని హెచ్చరించారు.



సమావేశం నిర్వహిస్తున్న అధికారులు

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ఆత్మకూరు: డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం విడుదల చేసిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజన సౌకర్యం కల్పించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి దినేష్‌కుమార్ డిమాండ్ చేశారు. పట్టణంలోని బుధవారం ధనుంజయ మీటింగ్‌హాల్‌లో ఎస్ఎఫ్ఐ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్యార్థులకు మంచి భోజన సౌకర్యం కల్పించిందన్నారు. భోజన పథకం నిర్వాహకులకు మెస్‌చార్జీలు పెంచి న్యాయం చేయాలన్నారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, సాయి, గంగాధర్, లింగేష్ పాల్గొన్నారు.

కర్నూలు వెళ్లి పింఛన్ పంపిణీ

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు మండలం శాతనకోట గ్రామానికి చెందిన పుల్లమ్మ అనే వృద్ధురాలు అనారోగ్యంతో కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న శాతనకోట వలంటీర్ భారతీ కర్నూలు వెళ్లి వృద్ధురాలికి ఫించన్ అందజేసింది.

గుండె శస్త్ర చికిత్స చేయించుకున్న వృద్ధురాలికి

ఆత్మకూరు: పట్టణంలోని ఎస్పీజీ పాలెంకు చెందిన గౌరమ్మ అనే వృద్ధురాలు ఇటీవల కర్నూలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో గుండె ఆపరేషన్ చేయించుకొని, చికిత్స పొందుతోంది. విషయం తెలుసుకున్న ఆ వార్డు వలంటీర్ షేక్షావలి బుధవారం కర్నూలు వెళ్లి గౌరమ్మకు ఫించన్ అందజేశాడు.

రాష్ట్రాలను దాటి పింఛన్ పంపిణీ

వెలుగోడు: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకువచ్చిన వలంటీర్ వ్యవస్థ లబ్ధిదారులకు వరంలా మారింది. వెలుగోడు పట్టణంలోని 3వ సచివాలయం పరిధిలోని ఎస్.ఆయేషా (పెన్షన్ ఐడీ 113535146) గత 2 నెలల నుంచి కేరళ రాష్ట్రంలోని ఆయుర్వేద హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటోంది. దీంతో ఆమె రెండు నెలల నుంచి పెన్షన్ తీసుకోకపోవడం లేదు. 3 నెలలు డబ్బులు తీసుకోకపోతే పెన్షన్ క్యాన్సల్ అవుతుందని గ్రహించిన వలంటీర్ అబ్దుల్ వహీద్ కేరళకు వెళ్లి పెన్షన్ సొమ్ము అందజేసి అందరి ప్రశంసలు అందుకున్నాడు. వలంటీర్ అబ్దుల్ వహీద్‌కు, సీఎం వైఎస్ జగన్‌కు ఆయేషా కృతజ్ఞతలు తెలిపారు.



పుల్లమ్మకు ఫించన్ అందజేస్తున్న వలంటీర్ భారతి



గౌరమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ షేక్షావలి

ఆశావర్కర్లపై పని ఒత్తిడి తగదు

జూపాడుబంగ్లా: ఆశావర్కర్లపై పని ఒత్తిడి తగదని ఆశా వర్కర్ల యూనియన్ జిల్లా అధ్యక్షురాలు నాగమణి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆశావర్కర్ల సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్లకు ప్రభుత్వం ఇచ్చిన సెల్‌ఫోన్లు, 2జీ సిమ్స్ సక్రమంగా పనిచేయటం లేదన్నారు. తద్వారా ఆన్‌లైన్‌లో పొందుపర్చాల్సిన వివరాలు సకాలంలో నమోదు చేయలేకపోతున్నారని చెప్పారు. దీంతో పనిఒత్తిడికి గురికావాల్సి వస్తుందని ఆమె తెలిపారు. ఆశావర్కర్లకు నూతన సెల్‌ఫోన్లు, 4జీ సిమ్‌కార్డులతో పాటు ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవులు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సునీతమ్మ, పార్వతమ్మ, నిర్మలమ్మ, సరస్వతీ, ఆశావర్కర్ల జిల్లా ఉపాధ్యక్షుడు భాస్కరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.